క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె. పట్నాయక్

వేపాడ: సోంపురం ఉన్నత పాఠశాలలో మన బడి నాడు-నేడు పథకంలో భాగంగా చేపడతున్న అభివృద్ధి పనులను ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ గురువారం పరిశీలించారు. అదనపు భవనాలనిర్మాణ పనులు, విద్యుత్, రన్నింగ్‌వాటర్, బ్లాక్ బోర్డులు, ఫ్యాన్ల ఏర్పాటు తదితర పనుల ను వేసవి సెలవుల అనంతరం పాఠశాల తెరిచేనాటికి పూర్తి చేయించాలని హెచ్ఎం బాలభాస్కర్‌కు సూచించారు.

సీసీ కాలువల నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డవర పంచాయతీ పరిధిలో మరుపల్లి గ్రామంలో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.2లక్షలతో సీసీ కాలువల నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు గురువారం భూమిపూజ చేశారు. పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సర్పంచ్ మీనా, ఎంపీటీసీ లక్ష్మి, వైస్ సర్పంచ్ ఆదారి అప్పారావు, గ్రామపెద్దలు కె.సత్యనారాయణ, శ్రీరాములు, మురళీరాజు, కేత వీరన్న, సన్యాసిదేముడు పాల్గొన్నారు.

ఆర్ఓబీ పనులు ప్రారంభం


ఆర్ఓబీ వద్ద తాత్కాలిక రోడ్డు పనులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం రైల్వే గేటు సమీపంలో కొంత కాలంగా నిలిచిపోయిన ఆర్ఓబీ నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. రూ. 22 కోట్లతో ఆర్ఓబీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆర్‌అండ్‌బీ జేఈ మురళీ చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తి చేయిస్తామని ఆయన తెలిపారు.

రూ.42 లక్షలతో నాడు-నేడు పనులు


మరుగుదొడ్ల భవనాల నిర్మాణం చేపడుతున్న కార్మికులు

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం ఉన్నత పాఠశాలకు మన బడి నాడు-నేడు పథకంలో భాగంగా అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.42 లక్షలు మంజూరు చేసింది. పాఠశాలలో ప్రస్తుతం అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరమ్మతులు, తరగతి గదుల్లో విద్యుత్ పనులు, టైల్స్ వేయడం పూర్తయ్యిందని హెచ్ఎం శ్రీను గురువారం తెలిపారు. మరుగుదొడ్లు, వంటగది భవనాల నిర్మాణం, ఇతర పనులను వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి చేయిస్తామని ఎస్ఎస్ఏ జేఈ ఉపేంద్ర తెలిపారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పనులు పూర్తిచేయాలి


జామి పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజు

జామి: మండలంలోని రామయ్యపాలెంలో మధ్యలో నిలిచిపోయిన ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం) నిర్మాణాన్ని రెండు రోజుల్లో పూర్తిచేయించాలని ఈఓపీఆర్డీ ఐ.వి.లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీదేవిని డీపీఓ శ్రీధర్‌రాజు ఆదేశించారు. ఎస్‌డబ్ల్యూపీసీని గురువారం ఆయన పరిశీలించారు. అంతకుముందు జామి పంచాయతీ కార్యాలయాన్ని, శాఖ గ్రంథాలయాన్ని ఆయన సందర్శించా రు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞానబడి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఘనంగా బంగారమ్మ తల్లి పండగ

బొండపల్లి: అంబటివలస గ్రామంలో బంగారమ్మతల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యే క పూజలు చేశారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు నిర్వహించారు.గ్రామపెద్దల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సంగిడీరాళ్ల పోటీల ను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ కసవయ్యతో పాటు ఎంపీటీసీ టి.అప్పలనాయుడు, గ్రామ పెద్దలు తగిన ఏర్పాట్లు చేశారు.


కొత్తవలస : రామలింగాపురంలో వలంటీర్లను సన్మానిస్తున్న వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు


గుర్ల: పెద్దబంటుపల్లిలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


మెరకముడిదాం: కొర్లాంలో వలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

పథకాల అమలులో వలంటీర్లదే కీలకపాత్ర

● 'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట/వేపాడ: ప్రభుత్వ పథకాల అమలులో కీలక పాత్రపోషిస్తున్న గ్రామ వలంటీర్లు కచ్చితంగా పురస్కారాలకు అర్హులు అని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఎస్.కోట మండలంలోని ఆలుగుబిల్లి గ్రామంలో ఆలుగుబిల్లి, చామలాపల్లి పంచాయతీల వలంటీర్లను, వేపాడ మండలం శింగరాయిలో సోంపురం, ఆతవ, శింగరాయి సచివాలయాల పరిధి వలంటీర్లను గురు వారం సన్మానించారు. ఎస్.కోట ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు జెడ్పీటీసీ ఎం.వెంకట లక్ష్మి, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎంపీడీఓ శేషుబాబు, నాయకులు బీల వెంకటరావు, స్వామినాథం, జుత్తాడ కృష్ణ. వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, వేపాడ మండల సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీనివాసరావు, ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె. పట్నాయక్, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.


వేపాడ: శింగరాయిలో వలంటీర్ల సత్కార కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, ప్రజాప్రతినిధులు

వలంటీర్ల సేవలు అభినందనీయం

జామి: వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు అన్నారు. భీమసింగి సచివాలయం పరిధిలో సేవా వజ్ర అవార్డుకు ఎంపికైన వలంటీర్ సురేష్, సేవారత్నకు ఎంపికైన ఆల్తి స్వాతితో పాటు సచివాలయ పరిధి వలంటీర్లను సేవా మిత్ర అవార్డులతో గురువారం సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, సర్పంచ్ జె.వెంకటలక్ష్మి, ఎంపీ డీఓ ఎం.సతీష్ పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శం

మెరకముడిదాం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెలకొల్పిన గ్రామవలంటీర్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్ అన్నారు. మండలంలోని కొర్లాం, బుధరాయవలస గ్రామాల్లో వలంటీర్లను గురువారం సన్మానించారు. ఎంపీటీసీ జంపన సావిత్రమ్మ, బుధరాయవలస సర్పంచ్ సారిక తమ్మినాయుడు, నాయకులు జంపన శ్రీనివాసరాజు, సరిధి రమేష్, బూర్లె సురేష్‌కుమార్, బాలి మహేష్, ఎంపీడీఓ పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

కొత్తవలస: అవినీతికి తావులేకుండా పథకాలకు పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తూ, సేవే పరమావధిగా విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్లకు వందనమని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు అన్నారు. మండలంలోని ముసిరాం, దేవాడ, రామలింగాపురం సచివాలయాల పరిధి గ్రామ వలంటీర్లను రామలింగాపురం సచివాలయంలో గురువారం ఆయన సన్మానించారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, ఎంపీడీఓ వై.పద్మజ, ముసిరాం, దేవాడ, రామలింగాపురం గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎల్.కోట మండలంలో..

లక్కవరపుకోట: మండలంలోని గేదులవానిపాలెం, భీమాళి గ్రామాల సచివాలయాల పరిధి వలంటీర్లను ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు గేదెలవానిపాలెం సచివాలయంలో గురువారం సన్మానించారు. భీమాళి సర్పంచ్ కొయ్యాన కృష్ణ, ఎంపీడీఓ జి.జ్ఞానేశ్వరరావు పాల్గొన్నారు.

గుర్ల మండలంలో..

గుర్ల: మండలంలోని తెట్టంగి, కొండగంగ్రేడు, పకీరుకిట్టాలి, పెద్దబంటుపల్లిలో వలంటీర్లను ప్రజాప్రతినిధులు, నాయకులు గురువారం సన్మానించారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, బోళ్ల సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


బొండపల్లి: కొండకిండాం సచివాలయంలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ చలంనాయుడు

గంట్యాడ మండలంలో..

గంట్యాడ: మండలంలోని బుడతానపల్లి గ్రామంలో వలంటీర్లను ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి గురువారం సన్మానించారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచ్ అలమండ వాణి, ఎంపీటీసీ వర్రి అర్జునమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రంధిరాము, ఎంపీడీఓ భానోజీరావు పాల్గొన్నారు.

బొండపల్లి మండలంలో..

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి, కొండకిండాం గ్రామ సచివాలయాల పరిధి గ్రామ వలంటీర్లను ఎంపీపీ చల్లా చలంనాయుడు గురువారం ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ ఏ.వేదవతి, ఈఓపీఆర్డీ సుగుణాకర రావు, ఒంపల్లి, కొండకిండాం, కిండాం అగ్రహారం, వేంద్రాం గ్రామాల సర్పంచ్‌లు లండా నారాయణమ్మ, పెద్దమజ్జి ఆదిలక్ష్మి, కర్రోతు శ్రీనివాసరావు, బుంగ దేవుడు, నాయకులు పెద్ద మజ్జి గోపి పాల్గొన్నారు.


గంట్యాడ: బుడతానపల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ హైమావతి


చీపురుపల్లిరూరల్: పి.కె.పాలవలసలో వలంటీర్లను సన్మానిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

చీపురుపల్లి మండలంలో..

చీపురుపల్లిరూరల్: మండలంలోని పి.కె.పాలవలస, పెదనడిపల్లి,జి.ములగాం పంచాయతీల్లో వలంటీర్లను ప్రజాప్రతినిధులు,అధికారులు నాయకులు గురువారం సత్కరించారు.మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు,ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి, సర్పంచులు,ఎంపీటీసీలు,నాయకులు కరిమజ్జి శ్రీనువాసరావు,బైరెడ్డి సత్యవతి,బైరెడ్డి లక్ష్మణ,రేగాన ఆదినారాయణ,గొర్లె వెంకటరమణ,గడి రామునాయుడు,రేవల్ల సత్తిబాబు,రెల్లి వెంకటేష్,శివ పాల్గొన్నారు.


శృంగవరపుకోట: ఆలుగుబిల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, తదితరులు


లక్కవరపుకోట: గేదెలవానిపాలెంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు


జామి: భీమసింగిలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

పేదలకు వరం సీఎం సహాయ నిధి

● ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: కష్టాల్లో ఉన్న పేదలను కాలయాపన చేయకుండా అత్యవసరంగా ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎం రిలీఫ్ ఫండ్) పథకం ఆదుకుంటోందని, సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని పెదనడిపల్లి గ్రామానికి చెందిన జీనాపతి గణేశ్‌కు రూ.2.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను ఎంపీ బెల్లాన చీపురుపల్లి పట్టణంలోని తన క్యాంపు ఆఫీస్‌లో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చేరి చికిత్స చేయించుకునే వారు సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకుంటే అత్యంత త్వరగా సహాయం అందుతోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకుంటే నెలల తరబడి సాయం అందేది కాదని, తీరా అందిన తర్వాత ఆ చెక్కులు బ్యాంకుల్లో తీసుకునే వారు కాదని చెప్పారు. కానీ నేడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి కష్టాల్లో ఉన్న వారిని తక్షణమే ఆదుకుంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనలో ఆయన్ను కలిసే ప్రతి ఒక్కరి కష్టాన్ని తీర్చుతూ ఆదుకుంటున్నారని గుర్తు చేశారు. పెదనడిపల్లి సర్పంచ్ సూర పోలరాజు, మాజీ ఎంపీటీసీ సూర రాము, నాయకులు మంగళగిరి శ్రీను, ఇప్పిలి తిరుమల, గిరడ రాందాసు, తాడేల ఉమ, కరణం ఆది తదితరులు పాల్గొన్నారు.


బాధితుడికి సీఎం సహాయ నిధి చెక్ అందజేస్తున్న ఎంపీ చంద్రశేఖర్

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

చీపురుపల్లి: జాతీయ స్థాయి అండర్-19 ఖోఖో పోటీలకు పట్టణంలోని ఆదిత్య జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి తెలిపారు. విద్యార్థులను కళాశాలలో గురువారం ఆమెతో పాటు అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా కేంద్రం విజయనగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో సీహెచ్.వైకుంఠరావు, బాలికల విభాగంలో ఏ.ఆదిలక్ష్మి, పి.హాసిని, సీహెచ్.ప్రసన్న ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. జూన్ 6 నుంచి 12 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని స్పష్టం చేశారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

వీఏఏ, వీహెచ్ఏలకు శిక్షణ


మాట్లాడుతున్న మైక్రో ఇరిగేషన్ పీడీ లక్ష్మీనారాయణ

కొత్తవలస: 2023 ఖరీఫ్ కార్యాచరణ, బిందు, తుంపర సేద్యంపై మండలంలోని దెందేరు గ్రామ రైతు భరోసా కేంద్రంలో వేపాడ, ఎల్.కోట, కొత్తవలస మండలాల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు(వీఏఏ), విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్లకు ఆయా శాఖల అధికారులు గురువారం శిక్షణ ఇచ్చారు. ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి పంట కోత సీజన్ చివరి దశకు చేరుకుందని, జూన్,జూలై నెలల్లో మామిడి కొమ్మల కత్తిరింపు,ఎరువుల వినియోగం తదితర యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించాలని సూచించారు.

ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ బిందు, తుంపర సేద్యం ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు కావాల్సిన రైతుల వివరాలను శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. ఉద్యానవనశాఖ అధికారి ఉమాభరణి, మూడు మండలాల ఏఓలు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన నిలయాలు

చీపురుపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని, సెలవు రోజుల్లో గ్రంథాలయాలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలని జనవిజ్ఞాన వేదిక సమత కన్వీనర్ ఎం.సుశీల విద్యార్థులకు సూచించారు.వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయాల ఆవశ్యకతపై స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాల యానికి రోజూ వెళ్లడం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. సమయాన్ని వృథా చేసుకోవడం కంటే గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానం సంపాదించుకోవడం మంచిదని అన్నారు. మండలంలోని మెట్టపల్లి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఏ.రవికుమార్ విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయిని ఏ.గీతారాణి, లైబ్రేరియన్ ఎం.బుచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సుశీల

రాయితీపై పశుగ్రాస విత్తనాలు

వేపాడ: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్‌బీకే) రాయితీపై పశుగ్రాస విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని పశువైద్యాధికారి సింహాచలం నాయుడు గురువారం తెలిపారు. అయిదు కిలోల విత్తనాలను 75 శాతం రాయితీపై రైతుకు రూ.115 కే అందించనున్నట్లు పేర్కొన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జేవీకే స్టాక్ పాయింట్ సందర్శన


విద్యాకానుక సామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె. పట్నాయక్,తదితరులు

వేపాడ: మండల కేంద్రంలోని జేవీకే(జగనన్న విద్యా కానుక కిట్‌ల) స్టాక్ పాయింట్-4ను ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ గురువారం సందర్శించారు. 2022-23 విద్యా సంవత్సరంలో పాఠశాలల విద్యార్థులకు అందించనున్న జగనన్న విద్యా కానుక కిట్‌లోని యూనిఫాం, బ్యాగ్‌లు, బూట్లు, సాక్సులు, పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్‌ను పరిశీలించారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఆయన వెంట ఉన్నారు.

లేగదూడల ప్రదర్శన

శృంగవరపుకోట: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని సీతారాంపురం గ్రామంలో లేగదూడల ప్రదర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రదర్శనకు 62 లేగదూడలను పాడిరైతులు తీసుకురాగా మూడింటిని ఎంపిక చేసి సంబంధి పాడిరైతులకు బహుమతులు అందజేశారు. జిల్లా పశుగణాభివృద్ధి శాఖ కార్యనిర్వహణాధికారి దామోదర్ మాట్లాడుతూ నేటి లేగదూడలే రేపటి పాడి ఆవులని, లేగదూడల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దని పాడిరైతులకు సూచించారు. లింగ క్రమబద్ధీకరణ, కృత్రిమ గర్భధారణ విధానంలో ఆవులకు ఆడపెయ్యలు పుట్టేలా ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. పశుసంవర్ధ కశాఖ ఏడీ డాక్టర్ బి. చలపతిరావు మాట్లాడుతూ దూడలు పుట్టిన అరగంట లోపు ముర్రుపాలు తాగించాలని, పాముల మందు పట్టాలని, చెప్పారు. లేగదూడలకు కాల్షియం టానిక్‌లు పంపిణీ చేశారు.పశువైద్యులు జి.హేమలత, జగదీష్, సర్పంచ్ రామకృష్ణ, వెటర్నరీ అసిస్టెంట్లు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.


లేగదూడలను ప్రదర్శిస్తున్న పాడిరైతులు

బాధితులకు సహాయం

మెరకముడిదాం: మండలంలోని చినపూతికవలస గ్రామంలో బుధవారం సాయంత్రం సంభవించిన అగ్నిప్రమాదంలో ఏడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. బాధిత కుటుంబాలకు స్థానిక సర్పంచ్ అన్నపూర్ణమ్మ తనయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మజ్జి శ్రీనివాసరావు తన సొంత నిధులతో ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, దుస్తులను సమకూర్చారు. వీటిని బాధితులకు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్‌కుమార్ గురువారం అందజేశారు. గరుగుబిల్లి ఎంపీటీసీ కొండలరావు, నరసయ్యపేట సర్పంచ్ అప్పలనారాయణ, స్థానిక నాయకుడు అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.


బాధితులకు బియ్యం, దుస్తులు అందజేస్తున్న నాయకులు

పని ప్రదేశంలో సదుపాయాలు తప్పనిసరి

కొత్తవలస: ఉపాధి హామీ పని ప్రదేశంలో వేతనదారులకు తాగునీరు, టెంట్లు తదితర సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని ఉపాధి హామీ ఏపీఓ విజయలక్ష్మికి ఎంపీడీఓ వై.పద్మజ సూచించారు. మండలంలోని వీరభద్రపురం గ్రామ చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఉపాధి సిబ్బందితో ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి, ఎంతమంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారు, తదితర అంశాలపై ఆరా తీశారు. వేసవి కావడంతో పని ప్రదేశంలో వేతనదారులకు తాగునీరు, సేదతీరేందుకు టెంట్లు అందుబాటులో ఉంచాలని, గిట్టుబాటు వేతనం అందేలా వేతనదారులతో పని చేయించాలని సూచించారు.

నిబంధనల ప్రకారం పనిచేస్తే గరిష్ట వేతనం

బొండపల్లి: నిబంధనల ప్రకారం ఉపాధి పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందని వేతనదారులకు ఎంపీడీఓ ఏ.వేదవతి సూచించారు. మండలంలోని ఒంపల్లి గ్రామంలో ఉపాధి పనులను గురువారం ఆమె పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడుతూ జాబ్ కార్డులో పేరు ఉన్నవారు మాత్రమే పనులకు హాజరు కావాలని, ఒకరికి బదులు మరొకరు పనులకు వస్తే చర్యలు తప్పవని అన్నారు. మండలంలో ప్రస్తుతం వేతనదారులకు రోజువారీ సరాసరి వేతనం రూ.250 వరకు అందుతోందని చెప్పారు. ఏపీఓ బి.కృష్ణవేణి ఎంపీడీ ఓ వెంట ఉన్నారు.


కొత్తవలస: వీరభద్రపురంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పద్మజ


బొండపల్లి: ఒంపల్లిలో ఉపాధివేతనదారులకు నిబంధనలు వివరిస్తున్న ఎంపీడీఓ వేదవతి

ఈదురుగాలులతో వర్షం

వేపాడ: మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఈదురుగాలులకు జాకేరు గ్రామంలోని పాఠశాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్ స్తంభాలతో సహా కూలిపోవడంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుధవారం, గురువారం వరుసగా రెండురోజులు వీచిన ఈదురు గాలులకు అరటితోటలు నేలకొరిగాయి. మామిడి కాయలు నేలరాలడంతో మామిడి రైతులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు.


జాకేరులో కూలిన ట్రాన్స్‌ఫార్మార్